# నివాస్ న్యూస్

## తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 428 ఎడిటర్ : బజ్జూర్ల శ్రీనివాస్, ప్రకాష్ జాదవ్, శనివారం.02.08.2025 పేజీలు :6 వెల : రూ.4



## రిపోర్టర్లు కావలెను

నివాస్ న్యూస్ దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ క్రైమ్ రిపోర్టర్లు నియోజక వర్గాల వారీగా ఆర్ సి ఇన్‌చార్జిలు మరియు రిపోర్టర్లు కావలెను

ఫోన్ నెంబర్ : 8099995078
97058 52875

## నివాస్ న్యూస్ డిజిటల్ పేపర్ కోసం స్కాన్ చేయండి








# నేడు 'కాళేశ్వరం' నివేదికపై కీలక భేటీ!



హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన పీసీ ఘోష్ కమిషన్ నిన్న తుది నివేదికను ప్రభుత్వానికి అందించిన విషయం తెలిసిందే. దీనిపై సీఎం.రేవంత్రెడ్డి నేతృత్వంలో ఇవాళ కీలక సమావేశం జరగనున్నట్లు తెలుస్తోంది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్, సి.ఎస్ రామకృష్ణారావు, ముఖ్య కార్య దర్శి రాహుల్ బొజ్జా సీఎం.కు నివేదిక అందిస్తారని సమాచారం. దీనిపై చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# "ఛత్తీసగఢ్‌లో కాథలిక్ సన్యాసినుల అన్యాయ అరెస్టును హోప్ ఇన్ క్రైస్ట్ ఫెలోషిప్ తీవ్రంగా ఖండిస్తుంది"





నివాస్ న్యూస్ ప్రతినిధి

హైదరాబాద్ : ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు కాథలిక్ సన్యాసినులపై జరిగిన అన్యాయ అరెస్టును హోప్ ఇన్ క్రైస్ట్ ఫెలోషిప్ వ్యవస్థాపకులు బిషప్ డా. పీటర్ నాయక్ లకావత్ తీవ్రంగా ఖండించారు.

"ఈ అరెస్టులు నిరాధార ఆరోపణలపై ఆధారపడినవి. ఇవి మతపరమైన బెదిరింపులు మరియు రాజ్యాంగ హామీ ఇచ్చిన మత స్వేచ్ఛకు విరుద్ధం" అని బిషప్ డా. పీటర్ నాయక్ లకావత్ పేర్కొన్నారు.

తక్షణ డిమాండ్లు:

1. సన్యాసినులపై ఉన్న అన్ని తప్పుడు ఆరోపణలను వెంటనే ఉపసంహరించాలి.

2. వారిని బేషరతుగా విడుదల చేసి, భద్రత మరియు గౌరవాన్ని నిర్ధారించాలి.

3. మైనారిటీలను వేధించడానికి చట్ట వ్యవస్థను దుర్వినియోగం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

4. మత స్వేచ్ఛ మరియు ప్రాథమిక హక్కులను రక్షించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత.

సంఘీభావం మరియు పిలుపు:

ఛత్తీస్‌గఢ్‌లోని కాథలిక్ చర్చి మరియు మొత్తం క్రైస్తవ సమాజంతో సంఘీభావంతో నిలుస్తున్నాము.

అన్ని పౌర సమాజ సంస్థలు, మానవ హక్కుల సంస్థలు మరియు తోటి పౌరులు లక్ష్యంగా చేసుకున్న మతపరమైన హింసకు వ్యతిరేకంగా స్వరం వినిపించాలి భారతదేశంలో శాంతి, సామరస్యం మరియు మత స్వేచ్ఛ కోసం మేము ఐక్యంగా నిలబడతాము. సంఘీభావంగా, బిషప్ డా. పీటర్ నాయక్ లకావత్ వ్యవస్థాపకులు, హోప్ ఇన్ క్రైస్ట్ ఫెలోషిప్.

# ఏపీ పోలీస్ కానిస్టేబుల్ తుది ఫలితాల విడుదల




ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్టు1

ఏపీలో పోలీసు కానిస్టేబుల్ నియామకాల తుది ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర హెూం మంత్రి అనిత, ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఈ రోజు ఉదయం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ఫలితాలను విడుదల చేశారు. ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ https://slprb.ap.gov.in/లో ఫలితాలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఇక, ఈ ఫలితాల్లో గండి నానాజి 168 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు అధికారులు ప్రకటించారు. అలాగే జి.రమ్య మాధురి 159 మార్కులతో రెండో స్థానం, మెరుగు అచ్యుతారావు 144.5 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. ఈ రిక్రూట్‌మెంట్ ద్వారా 6,100 కానిస్టేబుల్ పోస్టులను కూటమి ప్రభుత్వం లో భర్తీ చేయనున్నారు.

# లక్నవరంలో పంట కాలువలకు నీటిని విడుదల చేసిన తెలంగాణరాష్ట్ర మంత్రి సీతక్క

## లక్నవరం చెరువు కింద ఉన్న ప్రతి ఒక్క ఎకరాకు సాగునీరు అందిస్తాం

## త్వరలో రామప్ప చెరువు నుండి కెనాయిల్ ద్వారా లక్నవరం చెరువును పూర్తిగా నింపుతాం





ములుగు నివాస్ న్యూస్ ఆగస్టు 1

గోవిందరావుపేట లక్నవరం వద్ద పంట కాలువలకు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేడు శుక్రవారం రోజున నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత కొంతకాలంగా రైతులకు నాట్లు వేసుకోవడానికి నీటి కొరత ఉందని తెలుసుకొని, ఇటీవల లక్నవరం సరస్సు తూముల మరమ్మతు పనుల అనంతరం నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం లక్నవరం సరస్సు 28 ఫీట్ల నీటి మట్టం కలిగి ఉందని, మొత్తం 33 ఫీట్లు సామర్థ్యాన్ని సరస్సు కలిగి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు రైతుకు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు

# రేపు వారణాసిలో మోడీ పర్యటన



ఢిల్లీ హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1

ప్రధాని నరేంద్ర మోడీ రేపు వారణాసిలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా రూ. 2,200 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. అలాగే, 20వ విడత పీఎం కిసాన్ నిధులను ప్రధాని రేపు విడుదల చేయనున్నారు. 9.7 కోట్ల మంది రైతులకు గాను రూ. 20,500 కోట్లు విడుదల కానున్నాయి.

# 11 స్థానాల్లో ఉప ఎన్నికలకు సిద్ధం కావాలి కేసీఆర్



హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు1

తెలంగాణ : పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ ఉపఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని పార్టీ నేతలతో చెప్పినట్లు సమచ్చారం. జూబ్లీహిల్స్ సహా 11 స్థానాల్లో బై ఎలక్షన్స్‌కు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని చెప్పినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాగా స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని SC చెప్పిన విషయం తెలిసిందే.

# అనిల్ అంబానీకి ఈడీ నోటీసులు.



ఢిల్లీ/హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1

లోన్ ఫ్రాడ్ కేసులో ఈ నెల 5న విచారణకు రావాలని ఆదేశం. జులై 24న అనిల్ అంబానీకి చెందిన 50 కంపెనీలు, 25 మంది బిజినెస్ పార్ట్‌నర్స్ ఇళ్లపై ఈడీ దాడులు. మూడ్రోజుల పాటు సోదాలు నిర్వహించిన ఈడీ.

# చెట్లతోనే మానవాళి మనుగడ

## వీచే గాలి స్వచ్ఛంగా ఉంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉంటారు

## ములుగు జిల్లాను అడవి జిల్లాగా తీర్చిదిద్దుదాం.





ములుగు నివాస్ న్యూస్ ఆగస్టు 1

నేటి బాలలే రేపటి భావితరాల పౌరుల తరహాలోనే ఈనాటి మొక్కలే రేపటి భారీ వృక్షాలుగా తయారవుతాయని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో ని ఏకో పార్కులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఆర్ పి ఎఫ్ 39 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ కుమార్, టి జి ఎస్ పి 5 వ బెటాలియన్ కమాండెంట్ సుబ్రమణ్యం, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ 25 వేల మొక్కలు నాటాలని లక్ష్యంతో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం ఆశించదగ్గ విషయమని అన్నారు. ములుగు జిల్లా పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని పర్యటక ప్రాంతం తో పాటు దట్టమైన అడవులు ఉండటం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. ఈకో ప్రాంతంలో వాచ్ టవర్,వాక్ ఫాల్స్ ఏర్పాటు చేయడం చెప్పుకోదగ్గ విషయమని, అడవులను రక్షిస్తూనే పచ్చదనాన్ని కాపాడుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన గాలి ద్వారా వారి ఆయుష్ పెరుగుతుందని, అడువులను కాపాడే విషయం లో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ములుగు జిల్లాను అడవి జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కృషి చేస్తూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మా చిన్నతనంలోహావన మహోత్సవం గురించి పుస్తకాలలో ప్రత్యేకంగా చదువుకున్నామని కానీ నేడుహా ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న వనమోత్సవం కార్యక్రమంలో భాగస్వాములు అవడం చాలా సంతోషంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ములుగు జిల్లా ఎక్కువ అటవీ విస్తీర్ణం కలిగి ఉందని, జిల్లాలో వనదేవతలు కొలువై ఉన్నారని పేర్కొన్నారు.

# శ్రీశైలం చేరకముందే కృష్ణా నీళ్లు సీమకురోజూ లక్ష క్యూసెక్కులకు పైగా తరలించుకుపోతున్న ఏపీ

బ్యాక్వాటర్ నుంచి రోజూ లక్ష క్యూసెక్కులకు పైగాతరలించుకుపోతున్న ఏపీ

స్పిల్వేను తలపించే 14 గేట్లతో వచ్చిన వరదను వచ్చినట్లే మలుపుతున్న పోతిరెడ్డిపాడు

అప్రోచ్ చానల్, కాలువల కెపాసిటీని భారీగా పెంచడంతో సీమ వైపు పరుగు

పోతిరెడ్డిపాడుకు తోడైన హంద్రీనీవా, ముచ్చుమర్రి లిఫ్టులు

బనకచర్ల దిగువన కాల్వల కెపాసిటీని పెంచే పనులు సైతం ప్రారంభించిన ఏపీ

ఇప్పటికే రైట్ మెయిన్ కెనాల్ ఆధునీకరణ పూర్తి.. ఇప్పుడు తెలుగు గంగకూ లైనింగ్

పోతిరెడ్డిపాడు, బనకచర్ల వద్ద సెక్యూరిటీ, సీసీ కెమెరాలతో పకడ్బందీ నిఘా

ఆంధ్ర ప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్టు1




మహబూబ్‌నగర్ : శ్రీశైలం చేరకముందే కృష్ణమ్మ సీమకు మళ్లుతున్నది. ఏపీ చెప్తున్న వివరాలకు, శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తరలించుకుపోతున్న నీటి లెక్కలకు భారీ తేడా కనిపిస్తున్నది. 14 తూములతో స్పిల్వేను తలపిస్తున్న పోతిరెడ్డిపాడు హెడ్రెగ్యులేటర్ల ద్వారా కృష్ణా నదికి వస్తున్న వరదను సగానికి సగం అటు నుంచి అటే మళ్లించుకుంటున్నది. కొద్దిరోజులుగా ఇక్కడి నుంచి రోజుకు కేవలం 30 వేల క్యూసెక్కులను తరలిస్తున్నట్లు ఏపీ అధికారులు చెప్తున్నా.. అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా చూసినప్పుడు లక్ష క్యూసెక్కులకు మించి తరలిస్తున్నట్టు స్పష్టమవుతున్నది. పోతిరెడ్డిపాడు వద్ద ఇప్పటికే అప్రోచ్ చానల్ కెపాసిటీ పెంచుకున్న ఏపీ.. ఇప్పుడు శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్(ఎస్ఆర్ఎంసీ) సహా కాల్వల సామర్థ్యాన్ని మరింత పెంచుకుంది. అంతేకాకుండా పోతిరెడ్డిపాడుతో ఆగకుండా.. అటు హంద్రీనీవా, ఇటు ముచ్చుమర్రి లిఫ్టుల ద్వారా మరో 50 వేల క్యూసెక్కుల నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసుకుంటూ యథేచ్ఛగా నీటి దోపిడీకి పాల్పడుతున్నట్లు 'వెలుగు' క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది.

శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, గతంలో 880 అడుగులు నిండాక మాత్రమే పోతిరెడ్డిపాడు తూముల ద్వారా నీటిని తీసుకునేలా ఏర్పాటు ఉండేది. 11,500 క్యూసెక్కుల చొప్పున రోజుకు ఒక టీఎంసీ మాత్రమే తరలించేలా పరిమితి ఉండేది. కానీ వైఎస్ఆర్ హయాంలో పోతిరెడ్డిపాడు విస్తరణలో భాగంగా తూముల ఎత్తు తగ్గించి 854 అడుగుల స్థాయి నుంచే రోజుకు 4 టీఎంసీలను తీసుకునేలా కెపాసిటీ పెంచుకున్నారు. ఆ తర్వాత కాలంలో హెడ్ రెగ్యులేటర్‌ను 14 తూములకు పెంచి, రోజుకు 8 టీఎంసీలకు పైగా తోడుకునే స్థాయికి పోతిరెడ్డిపాడును విస్తరించారు. శ్రీశైలం నీటి మట్టం 800 టీఎంసీలకు పడిపోయినా లిఫ్టేసి మరీ పోతిరెడ్డిపాడు ద్వారా తరలించేందుకు జగన్హయాంలో రాయలసీమ లిఫ్టుస్కీమ్ చేపట్టిన సంగతి తెలిసిందే. తాజాగా 'వెలుగు టీమ్'ఏపీలోని నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పోతులపాడు గ్రామ శివారులోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్కు వెళ్లినప్పుడు అక్కడి సీన్చూసి కళ్లు బైర్లుగమ్మాయి. అది పేరుకే ఒక హెడ్రెగ్యులేటర్.. 14 గేట్లతో ఒక బరాజ్‌ను తలపిస్తున్నది. వీలైనన్ని ఎక్కువ నీళ్లను మళ్లించుకునేందుకు వీలుగా హెడ్ రెగ్యులేటర్ నుంచి నది వరకు ఒకటిన్నర కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల మేర అప్రోచ్ చానల్ కెపాసిటీని ఏపీ సర్కారు భారీగా పెంచుకున్నది.

కృష్ణా నీళ్లు హెడ్రెగ్యులేటర్ వైపు దూసుకొచ్చేందుకు అడ్డుగా ఉన్న చిన్న చిన్నగుట్టలన్నింటినీ తొలగించింది. దీంతో ఎలాంటి అడ్డూ లేకుండా ఎగువ నుంచి వస్తున్న కృష్ణానది శ్రీశైలంలోకి వెళ్లక ముందే సీమవైపు దారి మళ్లుతోంది. పేరుకు 30 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే పోతిరెడ్డిపాడు ద్వారా తరలిస్తున్నట్లు చెప్తున్నప్పటికీ, లక్ష క్యూసెక్కులకు పైగా వెళ్తున్నట్టు స్పష్టమవుతున్నది. ఇంత భారీ మొత్తంలో నీళు వెళ్లేందుకు అనుకూలంగా శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ (ఎస్ఆర్ఎంసీ)ను ఏపీ ఇప్పటికే విస్తరించింది. ఈ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి పోతులపాడు, తుమ్మలూరు, ఆనందపురం, రుద్రవరం, పాములపాడు, ఎర్రగూడూరు గ్రామ సమీపంలోని బనకచర్ల వరకు 16.4 కిలోమీటర్ల పొడవునా ఎస్ఆర్ఎంసీ ఆధునీకరణ పనులు పూర్తి చేశారు. ఒకప్పుడు 20 వేల క్యూసెక్కుల నుంచి 30 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే తరలించే కెపాసిటీ ఉన్న ఈ కెనాల్‌ను.. ఇప్పుడు లక్ష క్యూసెక్కులను తరలించేలా విస్తరించడంతో బనకచర్ల వరకు అది కాలువలా కాకుండా ఒక నదిలా మారిపోయింది. ఈ కెనాల్‌లో ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న నీటిని చూసి ఎక్కడ తెగుతుందోనని చుట్టుపక్కల రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వాయర్‌ను తలపిస్తున్న బనకచర్ల..

పోతిరెడ్డిపాడు నుంచి శ్రీశైలం రైట్మెయిన్ కెనాల్ద్వారా బనకచర్ల జంక్షన్‌కు వచ్చే నీటిని నిల్వ చేసేందుకు దాదాపు రెండున్నర కిలోమీటర్ల పొడవునా కెనాల్‌ను ఏపీ విస్తరించింది. పైనుంచి వచ్చే వరద హెచ్చుతగ్గులను తట్టుకునేలా, వరద తగ్గుముఖం పట్టాక వాడుకునేలా 3 నుంచి 4 టీఎంసీల నిల్వ ఉంచుకునేలా ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం శ్రీశైలం కుడి ప్రధాన కాలువ ద్వారా ఇక్కడికి ప్రతిరోజూ లక్ష క్యూసెక్కుల వరకు నీరు వస్తుండగా.. గాలేరు నగరి, ఎస్ఆర్బీసీ, తెలుగు గంగ కాలువల ద్వారా సీమకు తరలిస్తున్నారు. గాలేరు-నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్)కి చెందిన ఆరు తూముల ద్వారా కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల పరిధిలో ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.

ఇందుకోసం 120 టీఎంసీల కెపాసిటీ ఉన్న గండికోట, వామికుంట, సర్వరాయసాగర్, గొరకల్లు, అవుకు రిజర్వాయర్లను నింపుతున్నారు. వీటి కింద చిన్నాచితకా మరో 11 రిజర్వాయర్లు ఉన్నాయి. మరో కీలకమైన శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఆర్బీసీ) ద్వారా కర్నూల్, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో 80 టీఎంసీల కెపాసిటీ ఉన్న అలగనూరు, ఓక్, శ్రీనరసింహరాయ సాగర్ రిజర్వాయర్లను నింపుతున్నారు. ఇక్కడే ఎస్కేప్ చానల్ ద్వారా 40 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన మూడు తూముల నుంచి ఎస్ఆర్బీసీకి మళ్లిస్తున్నారు. చివర్లో ఎడమ వైపు ఉన్న తెలుగు గంగ (రాయలసీమ లిఫ్ట్) కెనాల్‌కు ప్రస్తుతం భారీ మొత్తంలో నీరు తరలుతున్నది. మెయిన్కెనాల్‌తో పాటు ఈ కాలువ కెపాసిటీని పెంచేందుకు పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ కెనాల్ నుంచి ముందుగా 60 టీఎంసీల కెపాసిటీ ఉన్న వెలుగోడు రిజర్వాయర్నింపి, అక్కడి నుంచి రుద్రవరం లేక్, తెలుగు గంగ రిజర్వాయర్, తెలుగు గంగ రిజర్వాయర్-2, బ్రహ్మసాగర్, సోమశిల, కండలేరు, పూండి రిజర్వాయర్లకు నీటిని తరలిస్తున్నారు. ఈ రిజర్వాయర్ల కెపాసిటీ దాదాపు 100 టీఎంసీల వరకు ఉండడం గమనార్హం. వీటిపైనా పదుల సంఖ్యలో లిఫ్టులు పెట్టి సీమలో మూలమూలాలకూ ఏపీ నీళ్లు ఇస్తున్నది.

ఏపీ చెప్తున్నవన్నీ దొంగ లెక్కలే..

శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తరలిస్తున్న కృష్ణా జలాలపై ఏపీ చెబుతున్నవన్నీ దొంగ లెక్కలేనని అక్కడి పరిస్థితులను బట్టి అర్థమవుతున్నది. పోతిరెడ్డిపాడు నుంచి బనకచర్లకు నీటిని తీసుకెళ్లే ఎస్ఆర్ఎంసీ కెపాసిటీని లక్ష క్యూసెక్కులకు పెంచడంతో ప్రస్తుతం గట్లు ఒరుసుకుంటూ కాలువ సాగుతున్నది. కానీ కేవలం 20 వేల క్యూసెక్కుల నుంచి 30 వేల క్యూసెక్కుల నీటినే తీసుకుపోతున్నట్టు ఏపీ చెప్పడంపై విస్మయం కలుగుతున్నది. నిజానికి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద ఎస్ఆర్ఎంసీ నుంచి ఎస్కేప్చానల్, హెచ్ఎన్ఎస్ఎస్, ఎస్ఆర్బీసీ, తెలుగు గంగకు వేర్వేరు తూముల ద్వారా నీరు సీమ వైపు తరలిస్తుండగా.. ఒక్కో కెనాల్ కెపాసిటీ 20 వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెంచుకోవడంతో ఏపీ చెప్తున్న లెక్కలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోతిరెడ్డిపాడు హెడ్రెగ్యులేటర్వద్ద టెలిమెట్రీలు ఏర్పాటు చేస్తే తప్ప.. ఏపీ ఎంత నీటిని ఎత్తుకెళ్తుందనే విషయంలో స్పష్టత రాదు. కానీ అందుకు ఏపీ అంగీకరించడం లేదు.

లిఫ్టులతోనూ ఎత్తిపోస్తున్నరు

పోతిరెడ్డిపాడు వద్ద కృష్ణా నదిని మళ్లిస్తున్న ఏపీ.. దీని ఎగువన ముచ్చుమర్రి, మల్యాల వద్ద లిఫ్టులను నిరంతరాయంగా నడుపుతున్నది. శ్రీశైలం బ్యాక్ వాటర్ 798 అడుగులకు పడిపోయినా ముచ్చుమర్రి నుంచి నీటిని ఎత్తిపోసుకునేలా ఈ లిఫ్టును డిజైన్ చేశారు. ఇందుకోసం అక్కడున్న గుట్టలను తొలిచారు. పంపుహౌస్ వరకు నీళ్లు వచ్చేందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తవ్వకాలు చేపడ్తున్నారు. కర్నూల్కడప కెనాల్(కేసీసీ)కు సుంకేసుల రైట్ కెనాల్ నుంచి నీటి సరఫరా ఆగిపోయినా, తుంగభద్ర నదికి వరద లేకున్నా ముచ్చుమర్రి నుంచి కృష్ణా జలాలను కేసీసీకి లిఫ్ట్ చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. దీని ఎగువన 20 కిలోమీటర్ల దూరంలో మల్యాల వద్ద ఏపీ ఇటీవల మరో లిఫ్టును ప్రారంభించింది. హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) లిఫ్ట్ పేరుతో కృష్ణా జలాలను తోడుకుపోతున్నది. రెండు దశల్లో వీటి పనులు చేపట్టాల్సి ఉండగా.. కొద్ది రోజుల కింద మొదటి దశ పనులు పూర్తయ్యాయి. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ లిఫ్టును ప్రారంభించగా.. మొత్తం 12 పంపుల్లో ప్రస్తుతం ఆరు పుంపుల ద్వారా శ్రీశైలం నుంచి కృష్ణా నీటిని ఎత్తి పోస్తున్నారు. 20 వేల క్యూసెక్కుల కెపాసిటీ ఉన్న కెనాల్ ద్వారా కృష్ణగిరి, పత్తికొండ, జీడీపల్లి రిజర్వాయర్లను నింపుతున్నారు. 11 పంపుహౌస్‌ల నుంచి కర్నూలు, అనంతపురం జిల్లాల వరకు నీటిని తీసుకుపోతున్నారు. వచ్చే ఏడాది చివరి కల్లా ఈ లిఫ్ట్ ఫేజ్-2 కూడా పూర్తి చేసేలా పనులు స్పీడప్ చేస్తున్నారు. ఈ పనులు పూర్తి చేస్తే దీని కింద 30 టీఎంసీల కెపాసిటీ ఉన్న గొల్లపల్లి, మర్ల, చర్లపల్లి, శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లు నింపుకునే అవకాశం కలుగుతుంది.

పోతిరెడ్డిపాడు, బనకచర్ల వద్ద గట్టి నిఘా

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద ఏపీ ప్రభుత్వం నిఘా పెంచింది. ఏపీ చెప్తున్న దానికి మూడు రెట్లు అధికంగా నీరు తరలివెళుండడంతో ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు సెక్యూరిటీని ఏర్పాటు చేసింది. ప్రధానంగా పోతిరెడ్డిపాడు వద్ద మఫ్టీలో ఉన్న సిబ్బంది డ్యామ్ పైకి వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కొత్తవాళ్లు కనిపిస్తే వారి ఐడీ కార్డులు చూపించుమని అడుగుతున్నారు. ఎక్కడి నుంచి వచ్చారు? ఎందుకు వచ్చారు? అనే వివరాలు ఆరా తీస్తున్నారు. అటు బకనచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద ఎడమ వైపు తెలుగు గంగ కెనాల్ ఉన్న ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే ఎస్కేప్ చానల్, ఎస్ఆర్బీసీ, జీఎన్ఎస్ఎస్ తూముల వద్దకు వెళ్లే మార్గం ఉండడంతో అక్కడి సిబ్బంది కొత్తవాళ్లపై నిఘా పెట్టి, ఎప్పటికప్పుడు పై అధికారులకు సమాచారం చేరవేస్తున్నారు.

# కొత్త సురేఖ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో మన దమ్మాయిగూడ మునిసిపల్ కమిషనర్ అయినటువంటి శ్రీ వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కాలనిలో సమస్యలను పరిక్షించడం జరిగింది....








మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు, 01 నివాస్ న్యూస్ ప్రతినిధి:- ఈరోజు మన స్థానిక మాజీ 5 వ వార్డ్ కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో మన దమ్మాయిగూడ మునిసిపల్ కమిషనర్ అయినటువంటి శ్రీ వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వారిని కలిసి మన కాలనీలోని ప్రధాన సమస్యలు మంచి నీరు, కాలనీ శుభ్రత గురించి వివరించడం జరిగింది మన సమస్యలను విని కమీషనర్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తారు అన్ని మనకు చెపడం జరిగింది దీనికి గాను కమీషనర్ మన కాలనీ వాసుల తరుపున కృతజ్ఞతలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యులు కొత్త భాస్కర్ గౌడ్, కాలనీ మాజీ అధ్యక్షులు ఎం కె పెంటాజీ, కాలనీ వాసులు వరగంటి గణేష్ పాల్గొన్నారు...

# తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు రద్దు



హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు1 తెలంగాణ ప్రభుత్వం పేదవారి సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అందరికీ తెలిసిందే..! తొలి విడతలో ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఈ ఇళ్లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. వచ్చే ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి, ఒకేసారి భారీ స్థాయిలో గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధతలో ఉన్నారు. అయితే తాజాగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ఒక కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 1,950 మంది అనర్హులు ఈ పథకం ద్వారా ఇళ్లు పొందినట్లు గుర్తించారు. దీంతో అధికారుల నిర్ణయంపై చర్యలు తీసుకుంటూ, వారి ఇళ్లను రద్దు చేశారు. మరోవైపు శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు అధికారులు. ప్రభుత్వం అర్హులకే ఇళ్లు అందించాలనే ఉద్దేశంతో పక్కగా చర్యలు తీసుకుంటున్నా.. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో అనర్హులకూ ఈ పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయి. వారు అప్‌లోడ్ చేసిన ఫొటోల ఆధారంగా, ముందుగానే బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసిన వారికి కూడా అప్రూవల్స్ లభించాయి. ఈ విషయంపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ సీరియస్‌గా తీసుకున్నారు. బేస్‌మెంట్ పూర్తయిన తరువాత తొలి విడతలో రూ. లక్ష చెల్లించే సమయంలో ఈ అనర్హులను గుర్తించినట్లు ఎండీ గౌతమ్ తెలిపారు. వెంటనే వీరికి మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేసి, వారి స్థానంలో కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని ఆయన చెప్పారు. అంతేకాక, దీనికి బాధ్యులైన పంచాయతీ సెక్రటరీలను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. మొదటి విడతలో సొంత భూమి ఉండి, ఇల్లు లేని వారికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నామని గౌతమ్ స్పష్టం చేశారు. కానీ తనిఖీల్లో బయటపడిన 1,950 మంది గతంలోనే ఇంటి నిర్మాణం ప్రారంభించి బేస్‌మెంట్ వరకూ నిర్మించారని పేర్కొన్నారు. అధికారుల తనిఖీల ప్రకారం, పథకం కింద దశల వారీగా అనేక స్థాయిల్లో పరిశీలన, అనంతరం కలెక్టర్ ఆమోదం ద్వారా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం జరుగుతుందని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. అయినప్పటికీ కొన్ని చోట్ల గల అలసత్వం వల్ల అనర్హులకు కూడా ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ అంశంపై అధికారులు తగిన చర్యలు తీసుకుంటూ, పథకం నిజమైన అర్హుల చేతికి చేరేలా చర్యలు ముమ్మరం చేశారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

ఢిల్లీ/హైదరాబాద్ నివాస్ న్యూస్ఆగస్టు 1




దేశంలోని రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవి ఉపరాష్ట్రపతి ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నిక తేదీ సెప్టెంబర్ 9 ఈసీ ప్రకారం, ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9న జరగనుంది. అదే రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంటు సభ్యులు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనవచ్చు. పోలింగ్ ముగిసిన అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) జరగనుంది. అదే రోజు ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది.

నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలాకు గడువులు

ఈ ఎన్నికలకు సంబంధించి అధికారిక నోటిఫికేషన్ ఆగస్టు 7న విడుదల చేయనున్నారు. అభ్యర్థులు ఆగస్టు 21 వరకు నామినేషన్లను దాఖలు చేయవచ్చు. అయితే, తమ నామినేషన్‌ను వెనక్కి తీసుకునేందుకు చివరి తేదీ ఆగస్టు 25గా నిర్ణయించబడింది.

ఉపరాష్ట్రపతి ఎన్నికలు ఎప్పుడు జరుగుతున్నాయి?

ఉపరాష్ట్రపతి ఎన్నికలు 2025 సెప్టెంబర్ 9న జరగనున్నాయి. అదే రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. వెంటనే కౌంటింగ్ పూర్తయ్యి ఫలితాలు ప్రకటించబడతాయి.

# రైతుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుంది

## అన్నదాత సుఖీభవ పథకం రైతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపుతుంది

## వితంతు పెన్షన్లు పంపిణీ చేసిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్ 1



దగదర్తి మండలంలో పుష్కలంగా పంటలకు సాగు నీరు అందుతుండటం పట్ల రైతుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం దగదర్తి మండలం దగదర్తి ఎస్టీ కాలనీలో వితంతు పెన్షన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరి ఇంటికి వెళుతూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటి పెద్ద బిడ్డగా ప్రతి ఒక్కరూ సంతోషగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరికీ అండగా నిలబడుతున్నారని, భర్త చనిపోయిన కుటుంబంలో భార్యలకు పెన్షన్ అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారని కొనియాడారు. ఎన్నో సంవత్సరాల నుంచి పింఛన్లు రాక ఇబ్బంది పడుతున్న మహిళలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో ఈరోజు కావలి నియోజకవర్గంలో 666 మంది మహిళలకు పింఛన్లు రావడం చాలా సంతోషకరమన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని, అన్నదాత సుఖీభవ పథకం రైతన్నల కుటుంబాల్లో వెలుగు నింపుతుందని తెలిపారు. మండలాన్ని అభివృద్ధి పదంలో నడపడమే తన ధ్యేయమని తెలిపారు. డిఎం ఛానల్, డిఆర్ ఛానల్ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, ఇక సాగునీటి కి ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన రోడ్లకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆగిపోయిన అనేక రోడ్లకు అనుమతులు తీసుకొని వచ్చి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. పేదల సేవే తన ధ్యేయమని తెలిపారు. గిరిజన కాలనీలో ప్రతి ఒక్కరికీ ఇంటి కాలనీ, పొలాలకి పట్టాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రతి పేద కుటుంబానికి భరోసా కలిగించేందుకు కూటమి ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షులు అల్లం హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి వింజం కొండపనాయుడు, వద్దే శ్రీనాద్, వద్దే వినయ్, ఎంపిపి తాళ్లూరు ప్రసాద్ నాయుడు, రవి రెడ్డి, అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు...

# ప్రకాశం జిల్లా సింగరాయకొండలో లబ్ధిదారులకు వితంతు పించన్లు పంపిణీ.



ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్టు 1రాష్ట్రంలో కొత్తగా 1.9 లక్షల మందికి వితంతు పింఛన్లు ఇచ్చాం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో భర్త చనిపోయిన ఏఒక్క మహిళకు పింఛన్ ఇవ్వలేదు. రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా మూడో నెల అన్నీ కలిపి ఇస్తున్నాం మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

# హరీష్ రావు ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు పొక్కలు కొట్టేందుకు నారా లోకేశ్‌కు హరీశ్‌రావు స్ట్రాంగ్ వార్నింగ్.




**హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1**

హరీష్ రావు హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై తెలంగాణ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు. పొక్కలు కొట్టేందుకు అని నారా లోకేశ్‌కు హరీశ్‌రావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. నిన్న నారా లోకేశ్ మాట్లాడుతూ.. మిగులు జలాలు సముద్రంలో కలుస్తున్నాయి.. కనబడుతలేదా అంటున్నాడు. సాగునీటి జలాల్లో నారా లోకేశ్‌కు అవగాహనం లోపం ఉంది. ఆయన యంగ్‌స్టర్.. భవిష్యత్‌ను చెడగొట్టుకుంటున్నారు. అవగాహన లేకుండా మాట్లాడి ప్రజల ముందు అభాసుపాలు అవుతున్నారు. అధికారం ఉంది కదా.. మందబలం ఉంది.. సీఎం రేవంత్, కేంద్రం మా చేతుల్లో ఉన్నారని ఏది మాట్లాడితే అది మాట్లాడితే చెల్లుతది అనుకుంటే అది పొరపాటు కదా..? మిగులు జలాలు సముంద్రంలో కలుస్తున్నాయి అంటున్నారు కదా.. ఒక వేళ నీళ్లు ఉన్నదే నిజమైతే కేంద్ర ప్రభుత్వ సంస్థలు సెంట్రల్ వాటర్ కమిషన్ మీ డీపీఆర్‌ను ఎందుకు తిప్పి పంపింది. గోదావరి రివర్ మేనేజమెంట్ బోర్డు ఎందుకు తిప్పి పంపింది. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ కూడా తిరస్కరించింది. నీళ్లు ఉన్నది నిజమైతే నాలుగు కేంద్ర సంస్థలు బనచర్లకు ఎందుకు తిరస్కరించాయో లోకేశ్ సమాధానం చెప్పాలి. గోదావరిలో తెలంగాణ వాటా ఎంత..? ఏపీ వాటా ఎంతో సమాధానం చెప్పాలని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పొక్క కొట్టి తీసుకుపోతున్నామా..? పొక్క కొట్టేందుకు ఇది ఏమైనా శ్రీశైలం ప్రాజెక్టా..? పోతిరెడ్డిపాడు ప్రాజెక్టా..? ఇది ఏమైనా ఉమ్మడి ఆంధ్రప్రదేశా..? కాళేశ్వరం ఒక లిఫ్ట్ ఇరిగేష్ ప్రాజెక్టు.. దీనికి పొక్క కొట్టుడు, చిల్లు కొట్టుడు ఉండదు. ఆనాడు ఉమ్మడి ఏపీలో ఈనాటి కాంగ్రెస్ నేతలు పదవుల కోసం పెదవులు మూసుకోవడం వల్ల మీరు ఆడిందే ఆట పాడిందే పాట.. పోతిరెడ్డిపాడుకు పొక్క కొట్టి నీళ్లు తీసుకుపోయారు.. ఈనాటి కాంగ్రెస్ నాయకుల మౌనం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. కానీ ఇక్కడున్నది బీఆర్ఎస్ పార్టీ. తెలంగాణ రాష్ట్రంగా ఉంది. ఇష్టమొచ్చినట్టు పొక్క కొడుతాం అంటే చూసుకుంటూ ఊరుకోం అని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. నారా లోకేశ్ అన్ని అబద్ధాలు మాట్లాడుతున్నాడు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతి లేదని మాట్లాడుతున్నాడు. ఒకటి కాదు రెండు కాదు 11 అనుమతులు ఉన్నాయి. అన్ని రకాల అనుమతులు సాధించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వం. మీకు అనుమానం ఉంటే ఈ అనుమతుల లేఖలు పంపిస్తాను వెరిఫై చేసుకోండి అని హరీశ్‌రావు సూచించారు. నిన్న లోకేశ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టును ఎప్పుడైనా అడ్డుకున్నామా..? టీడీపీ అడ్డుకోలేదు. తెలుగు ప్రజలంతా ఒక్కటే అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. మీకు తెల్వకపోతే మీ నాన్నను అడగండి.. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకున్నామా..? లేకపోతే ఎన్నిసార్లు అడ్డుకున్నాం అని మీ నాన్నను అడగండి. అన్ని అనుమతులు వచ్చిన తర్వాత 2018లో రద్దు చేయండి, పనులు నిలిపివేయండి అని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ బాబు ఏడు లేఖలు రాశారు. నిన్ననేమో మేం కాళేశ్వరం వ్యతిరేకించామా..? అని లోకేశ్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# మూడు నెలల్లో నిర్ణయం తీసుకోండి




**ఢిల్లీ/హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1**

పిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కేసులో సీజేఐ ధర్మాసనం తీర్పుహైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును తోసిపుచ్చిన సుప్రీం రాజకీయ ఫిరాయింపులు అడ్డుకోకపోతే ప్రజాస్వామ్య పునాదులకే ముప్పు అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పున:పరిశీలించాలి తెలంగాణలో పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దాఖలైన అనర్హత పిటిషన్లపై తీర్పు వెలువరించిన నాటి నుంచి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ను ఆదేశించింది. అలాగే ఈ వ్యవహారంలో గతేడాది నవంబర్ 22న రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. మొత్తం 'పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలను వీలైనంత త్వరగా లేదా మూడు నెలల్లోపు నిర్ణయించాలి. ఏ ఎమ్మెల్యే విచారణను కొనసాగించడానికి అనుమతించొద్దు. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే పార్టీ మారిన వారిపై న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది. పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 15న బీఆర్ఎస్, ఆ పార్టీ నేతలు కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, జి.జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజరు, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్రెడ్డి, ఎం.సంజరు కుమార్, కాలె యాదయ్య, బండ్ల కష్ణమోహన్ రెడ్డి, ప్రకాష్గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీపై పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు దాఖలైన తరువాత దాదాపు ఏడు నెలల్లో తొమ్మిది సార్లు సుప్రీంకోర్టు విచారణ జరిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి ముందు నుంచి ఈ పిటిషన్లపై విచారణ చేపట్టగా, పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రి నాయుడు, మోహిత్ రావు, స్పీకర్, ప్రతివాదుల తరపు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, అభిషేక్ మను సింఘ్వి, రవి శంకర్ జంధ్యాల, గౌరవ్ అగర్వాల్, నిరంజన్ రెడ్డి పలువురు వాదనలు వినిపించారు. కాగా సుదీర్ఘ వాదనల తరువాత ఈ ఏడాది ఏప్రిల్ 3న సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్లతో కూడిన ధర్మాసనం గురువారం 74 పేజీల తీర్పును వెలువరించింది.

'ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డైడ్' సూత్రం సరికాదు

ఈ కేసులో స్పీకర్కు ఆదేశాలు జారీ చేయడంలో వైఫల్యం రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ లక్ష్యాన్నే నీరుగార్చుతుందని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి అన్నారు. రాజకీయ ఫిరాయింపులను అరికట్టకపోతే, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని పేర్కొన్నారు. 'ఇప్పుడు మేం ఏ ఆదేశాలు జారీ చేయకపోతే%గా% 'ఆపరేషన్ సక్సెస్-పేషెంట్ డైడ్' అన్నట్టుగా ఉంటుంది. ఇది స్పీకర్ ప్రస్తుత తీరును పునరావృతం చేయడానికి దోహదపడ్డట్టే' అని సీజేఐ అభిప్రాయపడ్డారు. పదో షెడ్యూల్ కింద స్పీకర్ ట్రిబ్యూనల్గా పని చేస్తున్నప్పటికీ, ఎటువంటి 'కానిస్టిట్యూషనల్ ఇమ్యూనిటీ' ని పొందలేరని స్పష్టం చేశారు. అలాగే అనర్హత పిటిషన్లను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణను పొడగించడానికి అనుమతించవద్దని స్పీకర్ను ధర్మాసనం ఆదేశించింది. ఇక స్పీకర్లు అనర్హత పిటిషన్లను ఏండ్ల తరబడి పెండింగ్లో ఉంచే పరిస్థితిని రాజ్యాంగ ధర్మాసనం ఊహించి ఉండకపోవచ్చన్నారు. అంతేకాకుండా అనర్హత పిటిషన్లను స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయించాలని కీషమ్ మేఘచంద్ర సింఘ్ కేసులో ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. శివసేన, ఎన్సీపీ ఎమ్మెల్యేల ఫిరాయింపుల పిటిషన్లను నిర్ణీత సమయంలోగా నిర్ణయించాలని మహారాష్ట్ర స్పీకర్కు జారీ చేసిన ఆదేశాలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుందని సీజేఐ తీర్పులో పొందుపరిచారు. ఇక కోర్టులే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలన్న బీఆర్ఎస్ అభ్యర్థలను ప్రస్తావిస్తూ కిహొటో హొల్లోహన్, సుభాష్ దేశారు కేసుల్లో పూర్వాపరాలను పరిగణనలోకి తీసుకుంటూ, న్యాయస్థానాలే అనర్హత వేటు వేయాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని తోసిపుచ్చుతున్నట్టు స్పష్టం చేశారు.

పార్లమెంట్ పున:పరిశీలించాలి

అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పున: పరిశీలించాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. తీర్పు ఆరంభంలో రాజ్యాంగంలోని 52వ సవరణలో భాగంగా తెచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టం(యాంటి డిఫెక్షన్ లా)లోని అంశాలు, అభ్యంతరాలను సీజేఐ ప్రస్తావించారు. 'రాజకీయ ఫిరాయింపులు జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం. దీనిని ఎదుర్కోకపోతే మన ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది' అని అన్నారు. న్యాయస్థానాల్లో ఆలస్యం, అసెంబ్లీ పదవి కాలం ముగిసేలోపు అనర్హత పిటిషన్లపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేందుకే స్పీకర్కు నిర్ణయాధికారం ఇచ్చినట్టు అభిప్రాయపడ్డారు.

అయితే అనర్హత పిటిషన్లను నిర్ణయించడానికి స్పీకర్/ఛైర్మెన్కు అప్పగించే ప్రస్తుత యంత్రాంగం.. రాజకీయ ఫిరాయింపుల ముప్పును అరికట్టడానికి అనుకూలంగా ఉందో లేదో పున: పరిశీలించాలని ధర్మాసనం పార్లమెంట్ను కోరింది. 'మాకు ఎలాంటి సలహా ఇచ్చే అధికారం లేదు. అయినా అనర్హతపై స్పీకర్/ఛైర్మెన్లకు కల్పించబడిన హక్కులు రాజకీయ ఫిరాయింపులను సమర్థవంతంగా ఎదుర్కోగలదా? లేదా అనేది పార్లమెంట్ ఆలోచన చేయాలి. ప్రజాస్వామ్య పునాదులను నిలబెట్టే సూత్రాలను కాపాడుకోవాలంటే ఈ విధానం సరిపోతుందా? లేదా ? అనేది పున:పరిశీలించాలి. ఇలాంటి అనర్హత పిటిషన్లలో లోపాలు పునరావతం కాకూడదంటే దానిపై నిర్ణయం తీసుకోవడం పార్లమెంట్ బాధ్యత అని మేం భావిస్తున్నాం' అని సీజేఐ అభిప్రాయపడ్డారు.

# జాతీయ రహదారిపై గుంతలను తక్షణమే పూడ్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య డిమాండ్



**నివాస్ న్యూస్ కొత్తగూడెం**

కొత్తగూడెం నియోజకవర్గం లోని జాతీయ రహదారిపై భారీ వర్షాల కారణంగా ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో జాతీయ రహదారుల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారికి వినతి పత్రం అందజేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని జాతీయ రహదారిపై భారీ వర్షాల కారణంగా ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో జాతీయ రహదారుల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామవరం గోధుమ వాగు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల వల్ల వర్షం నిండిపోయి వాహనదారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నేషనల్ హైవే అధికారులు నామ మాత్రంగా ఇసుక,కంకర వేసి గుంతలు నింపడం వల్ల ప్రయోజనం లేదన్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు. భుక్య శ్రీనివాస్. నేరెళ్ల రమేష్. గోపి. బోయిన విజయ్, సత్యనారాయణ చారి,సుధాకర్. తదితరులు పాల్గొన్నారు


# టీచర్ల ప్రమోషన్ల షెడ్యూల్ విడుదలరేపటి నుంచి కౌన్సిలింగ్



**హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1**

టీచర్లకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ప్రమోషన్లకు సంబంధిచిన షెడ్యూల్‌ను విడదల చేయగా.. రేపటి నుంచి ఈనెల 11వ తేదీ వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ జరగనుంది. దాదాపు 3900 మందికి ప్రమోషన్లు లభించనున్నాయి. 900 వరకు ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండటంతో.. 900 మంది స్కూల్? అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్ మాస్టర్లుగా? ప్రమోషన్ లభించనుంది. జూన్ 30 వరకు ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.


# అనంతపురంలో ఒకే కుటుంబంలో ముగ్గురికి కానిస్టేబుల్ ఉద్యోగాలు



**ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్టు 1**

గుత్తికి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ దౌలా ముగ్గురు కుమారులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మహమ్మద్ అలీ, మహమ్మద్ గౌస్, మహమ్మద్ సమీర్ కానిస్టేబుళ్లు ఫలితాలలో మంచి ఉత్తీర్ణత సాధించారు. ఒకే కుటుంబంలో, అదీ ముగ్గురు సోదరులకు ఉద్యోగాలు రావడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ప్రస్తుతం వీరు అనంతపురంలో స్థిరపడ్డారు.

# రేపు రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ



**హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు1**

వ్యవసాయ రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా అందిస్తున్న నిధులను ఆగస్టు 2న (రేపు) విడుదల చేయనుంది. యూపీలోని వారణాసిలో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ నిధులు విడుదల చేయనున్నారు. తద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.7 కోట్ల రైతుల ఖాతాల్లోకి రూ.20,500 కోట్లు జమ చేయనున్నారు. ఏపీలో రైతులకు పీఎం కిసాన్ రూ.2 వేలతో కలిపి 'అన్నదాత సుఖీభవ' పథకంలో భాగంగా రూ.7 వేలు జమకానుంది.


# ప్రముఖ నటి రాధికకు అస్వస్థత ఆస్పత్రిలో పిక్స్ వైరల్



**హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1**

ప్రముఖ నటి రాధిక శరత్ కుమార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ నెల 28న ఆమె చెన్నైలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చేరారు. మొదట ఇది సాధారణ జ్వరమని భావించినా, వైద్య పరీక్షల అనంతరం డెంగ్యూ సోకినట్టు నిర్ధారణ అయ్యిందట. అందుకే ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉన్నా, పూర్తి కోలుకునే వరకు ఆసుపత్రిలోనే ఉండాలని వైద్యులు సూచించారని తెలిసింది. ఆమె త్వరగా కోలుకోవాలని అభిమానులు దేవుడిని ప్రార్థిస్తున్నారు.

# నేడు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం జాతికి అంకితం



**యాదాద్రి జిల్లా నివాస్ న్యూస్ ఆగస్టు 1**

నల్గొండ జిల్లా యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును నేడు (శుక్రవారం) జాతికి అంకితం చేయనున్నారు. రాష్ట్రంలో 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన తొలి యూనిట్ ఇది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. దీంతో పాటు రూ.950 కోట్లతో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పనులకు మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు.

# ముఖం' చూపించాల్సిందే




**హనుమకొండ జిల్లా నివాస్ న్యూస్ ఆగస్టు 1**

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఇక ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్)) హాజరు అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈఓలు ఆయా ఎంఈఓలు, హెచ్ఎంలను గురువారం ఆదేశించారు. గత ఏడాది ఫిబ్రవరినుంచి రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా టీచర్ల ముఖగుర్తింపు హాజరును అమలు చేస్తున్నారు. అక్కడ విజయవంతం కావడంతో నేటి(శుక్రవారం)నుంచి రాష్ట్రవ్యాప్తంగా, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, యూఆర్ఎస్, టీజీఆర్ఈఐఎస్‌లలో అమలు చేయనున్నారు.

డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా..

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు తీసుకుంటున్నారు. అందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్) యాప్‌ను వినియోగిస్తున్నారు. ఇదే యాప్ ద్వారా హెచ్ఎంలు, టీచర్ల, నాన్ టీచింగ్ ఉద్యోగుల ముఖ గుర్తింపు హాజరు అమలుచేయనున్నా రు. హెచ్ఎంలు తమ సెల్‌ఫోన్‌లోని డీఎస్ఈ యాప్‌లో టీచర్ మా డ్యూల్ టీచర్లకు, నాన్‌టీచింగ్ మాడ్యూల్‌లో నాన్‌టీచింగ్ సిబ్బందికి రిజిస్ట్రేషన్ చేయాలి. ఫొటో తీసి వారి వివరాలు, పాఠశాల సమయం తదితర వివరాలు అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక టీచర్లు, నాన్‌టీచింగ్ సిబ్బంది తమతమ సెల్‌ఫోన్లలో సంబంధిత యాప్‌లో ఇక ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తీసుకోవచ్చు. నేటినుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. జియోట్యాగింగ్‌ను కూడా ఇస్తారు. పాఠశాలలోనే ముఖ గుర్తింపు హాజరు తీసుకోవాల్సి. ఒకవేళ సెలవు పెడితే తప్పనిసరిగా యాప్‌లో రిక్వెస్ట్ పెట్టుకోవాల్సి ఉంటుంది. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఈఓలకు డెమో ఇచ్చినట్లు సమాచారం. విద్యార్థులకు ఇప్పటికే ముఖగుర్తింపు హాజరు తీసుకుంటున్నప్పటికీ కొన్నిపాఠశాలల్లో అమలుచేయటంలేదు. ఇందుకు పలు కారణాలు చూపుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల వేళలు ఇలా

పీఎస్‌లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, యూపీఎస్‌లు, హైస్కూళ్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటలవరకు పనివేళలున్నాయి. టీచర్లు ఉదయం నిర్దేశించిన సమయం కంటే ముందుగానే, సాయంత్రం విధుల సమయం ముగిశాక అంటే రోజుకు రెండుసార్లు ముఖ గుర్తింపు హాజరు తీసుకోవాల్సింటుంది.

ఇప్పటికే కలెక్టర్ ప్రతీరోజు సమీక్ష..

హనుమకొండ జిల్లాలో ఇప్పటికే విద్యార్థులకు తీసుకుంటున్న ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రతీరోజు సమీక్షిస్తున్నారు. హాజరు తక్కువగా ఉన్న పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పుడు టీచర్ల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను సైతం కలెక్టర్ ఏరోజుకారోజు పర్యవేక్షించే అవకాశం ఉంది. మరోవైపు డీఈఓ కార్యాలయాల్లో డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేస్తారు. డీఈఓలు కూడా టీచర్ల అటెండెన్స్‌ను పర్యవేక్షిస్తారు.

దుమ్మాకు చెక్‌పడినట్లేనా..?

విధులకు దుమ్మా కొట్టే కొందరు టీచర్లకు ముఖగుర్తింపు హాజరుతో చెక్‌పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లా కేంద్రాలనుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే టీచర్లు కొందరు సక్రమంగా విధులు నిర్వర్తించడంలేదనే ఆరోపణలున్నాయి. ఆలస్యంగా వెళ్లడం, సాయంత్రం నిర్దేశించిన సమయం కంటే ముందే వెళ్లిపోవడంలాంటివి జరుగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం నుంచి ఇతర జిల్లాలకు రైలు, బస్సుల ద్వారా, గ్రామీణ ప్రాంతాలకు షటిల్ సర్వీస్ చేసే టీచర్లు ఉన్నారు. ఈ ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌తో వారికి ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. డీఈఓలతోపాటు హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ అటెండెన్స్‌పై ప్రతీరోజు పర్యవేక్షిస్తారు.

నేటినుంచి పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ కొందరు ఉపాధ్యాయుల దుమ్మాలకు చెక్ పడినట్లే.. విద్యార్థులకు ఉపయోగిస్తున్న డీఎస్ఈ యాప్‌నే వినియోగం నాలుగు రోజులపాటు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ప్రభుత్వ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్‌స్కూల్స్, యూఆర్ఎస్, సాధారణ గురుకులాల్లోనూ అమలు డీఈఓ, కలెక్టర్లు ప్రతీరోజు పర్యవేక్షణ..

# కష్టజీవుల హక్కులను హరిస్తున్న పాలకులు

మార్కాపురం : దశాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితంగా కష్టజీవులకు కొన్ని హక్కులు, చట్టాలు సాధించుకున్నారని, నేటి పాలకులు వాటిని నిర్వీర్యం చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఆరోపించారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో వ్యవసాయ కార్మిక సంఘం మార్కాపురం మండల మహాసభ తురకా ఏడుకొండలు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ భూస్వాములు, జమిందార్లు, నైజాం నవాబులు, గ్రామీణ పెత్తందారులకు వ్యతిరేకంగా కష్టజీవులకు భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం సుదీర్ఘకాలం చేసిన పోరాటాల ఫలితంగానే భూసంస్కరణల చట్టం వచ్చిందని అన్నారు. పెరుగుతున్న ధరలతో పాటు కూలి రేట్లు పెంచాలని, కనీస వేతన చట్టం కావాలని చేసిన ఉద్యమాలతో ప్రభుత్వాలు ఈ మేరకైనా కూలి చట్టాలు చేశారని తెలిపారు.

నివాస్ న్యూస్ శనివారం.02.08.2025

# కొడుకు ప్రేమ పెళ్లి మధ్యవర్తుల టార్చర్‌తో తండ్రి సూసైడ్



జోగులాంబ గద్వాల జిల్లా నివాస్ న్యూస్ ఆగస్టు1

తెలంగాణ కొడుకు చేసిన పనికి తండ్రి సూసైడ్ చేసుకున్నాడు. జోగులాంబ గద్వాల జిల్లా జల్లాపురానికి చెందిన బతికిన హేమలమ్మ-జమ్మన్న కుమారుడు నవీన్(22) బంధువుల అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లి చేయాలని కోరగా తండ్రి నిరాకరించాడు. అమ్మాయిని తీసుకొని రహస్యంగా పెళ్లి చేసుకోవడంతో ఆమె కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధ్యవర్తులు జమ్మన్నను టార్చర్ పెట్టడంతో ఈనెల 29న సూసైడ్ చేసుకున్నాడు. ఆస్పత్రిలో పరిస్థితి విషమించి గురువారం మరణించాడు.

# నేటి నుంచి హైదరాబాద్‌లో రేషన్‌కార్డుల పంపిణీ




హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1

హైదరాబాద్‌లో రేషన్ కార్డుల పంపిణీ శుక్రవారం ప్రారంభమవుతుంది. మూడు రోజుల్లో 55,378 కొత్త కార్డులు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ హరిచందన తెలిపారు. కొత్తగా పంపిణీ చేయనున్న 55,378 కార్డులతో 2,01,116 మంది లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. పాత కార్డులలో అర్హులను చేర్చడంతో 2,32,297 మందికి లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ ప్రాంతాల్లో పాల్గొని లబ్ధిదారులకు కార్డులు అందించనున్నారు.

# పాఠశాలలోకి పాలిటిక్స్ నో ఎంట్రీ

ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్టు 1పాఠశాల ఆవరణలోకి తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు తప్ప ఏ ఇతర అనధికారిక వ్యక్తులను అనుమతించరాదు. రాజకీయ పార్టీల గుర్తులు, వస్తువుల ప్రదర్శన నిషేధం చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం.


PROCEEDINGS OF THE DIRECTOR OF SCHOOL EDUCATION
ANDHRA PRADESH :: MANGALAGIRI
Present:: Sri Vijay Rama Raju.V, IAS

RC.No.30/67/2025-A&I. Dated:01.08.2025

Sub: School Education No Access to School Premises for unauthorized persons except parents and SMC members-Certain Instructions - Issued.

******

Attention of all the Regional Joint Directors of School Education (RJDSES) and District Educational Officers (DEOs) in the State is invited to the subject cited above. It has come to the notice of the undersigned that unauthorized individuals and groups are entering school premises without prior permission from the Head of the Institution. Such unauthorized entry even for giving gifts/ donations to the students/ schools, except by parents and School Management Committee (SMC) members, which are causing disruptions to the ongoing academic activities are not permitted.

In order to prevent such unauthorized entry and to ensure uninterrupted continuation of academic instruction in the schools, the following instructions shall be implemented with immediate effect:

1. Restricted Entry:

No individual or group, other than parents or members of the SMC, shall be permitted entry into the school premises under any circumstances. If any contributions or materials in kind are to be given, they shall be submitted directly to the Headmaster/Headmistress (HM) without interacting with children or entering the classrooms.

Photographs with children are strictly prohibited.

2. Redressal of Grievances:

All grievances, complaints, or requests are to be submitted only to the Administrative Office. Staff and students should not engage directly with external individuals or organizations for grievance-related matters.

3. Prohibition of Political Symbols:

The display of any political symbols or materials, including flags, shawls, banners, or posters related to political parties or organizations are strictly prohibited within school premises.

Therefore, all the Regional Joint Directors of School Education (RJDSEs) and District Educational Officers (DEOs) in the State are herewith directed to issue clear and strict instructions to all Heads of Institutions and field functionaries under their jurisdiction to ensure strict compliance with the above guidelines. Any violations are to be reported to the undersigned with immediate effect.

VIJAY RAMA RAJU V
Director of School Education

To
All the Regional Joint Directors of School Education in the State.
All the District Educational Officers in the State.

# ఏపీ కానిస్టేబుల్, హెూంగార్డ్ నియామకాల నోటిఫికేషన్‌పై దాఖలైన పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు



ఆంధ్ర ప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్టు1

ఏపీ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను అదే హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసిందన్న ఏపీ ప్రభుత్వం.. ఈ ఏడాది జూన్ లో మొదలైన ఎంపిక ప్రక్రియ.. ఈరోజుతో ముగిసినట్లు కోర్టుకు చెప్పిన ప్రభుత్వం.. ఈరోజు ఉదయం ఫలితాలు కూడా విడుదల చేసినట్లు వెల్లడి.. హెూంగార్డు ఎంపిక ప్రక్రియపై హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై పిటిషన్.. ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన పలువురు అభ్యర్థులు.. జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ బలచంద్ర వరాలే ధర్మాసనం విచారణ.. ఫలితాలు కూడా విడుదలయ్యాక జోక్యం చేసుకోవట్లేదని స్పష్టం చేసిన ధర్మాసనం.

# తెలంగాణ ఎక్సైజ్ శాఖ కీలక నిర్ణయం వైన్స్ లైసెన్స్ ఇక మూడేళ్లు!

రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్స్ గడువును రెండేండ్ల నుంచి మూడేండ్లకు పెంచాలని ఎక్సైజ్ శాఖ భావిస్తున్నది




హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1

దీనికి సంబంధించి ఇప్పటికే ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న వైన్ షాపుల టెండర్ నవంబర్ 30తో ముగియనుండగా.. వచ్చే టర్మ్ నుంచి దీన్ని అమలు చేయాలని సూచనప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. దీనికి సంబంధించి మూడు రోజులుగా సెక్రెటేరియట్ లో ఎక్సైజ్ శాఖ అధికారులు సమావేశమై చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ఆగస్ట్ ఫస్ట్ వీక్ లో కొత్త టెండర్ల ప్రక్రియను ప్రారంభించి.. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా వ్యాపార నిబంధనల్లోనూ కొన్ని కీలక మార్పులు చేయనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత.. నూతన కంపెనీల బ్రాండ్లను సైతం అనుమతించనున్నట్లు సమాచారం.

మూడేండ్లకు రూ.3 లక్షల డిపాజిట్!

202-25కు సంబంధించి రూ. 2 లక్షల నాన్ రిఫండ్ విధానంతో రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహించారు. ఇందులో జీహెచ్‌ఎంసీ పరిధిలో 690 దుకాణాలు ఉన్నాయి.

రెండేండ్ల కాలపరిమితికి ఒక్కో దుకాణానికి రూ.1.05 కోట్లు యాన్యువల్ ఫీజు నిర్ణయించారు. మున్సిపల్, కార్పొరేషన్ల పరిధిలో ఈ ఫీజు రూ. 60%-%80 లక్షలుగా ఉంది. వీటి గడువు నవంబర్ 30తో ముగియనుంది. అయితే వచ్చే టర్మ్ లైసెన్సులకు సంబంధించి యాన్యువల్ ఫీజును కొంత మేర మార్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా టెండర్లలో పాల్గొనాలనుకునే వారు రూ.3లక్షలు ముందస్తు డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. గత టెండర్లలో నాన్ రిఫండ్ డిపాజిట్ ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ. 256 కోట్ల ఆదాయం సమకూరింది. యాన్యువల్ ఫీజుతో కలిపి ఇది రూ.2,460 కోట్లుగాఉంది. కాగా, ఈ సారి ఆదాయం మరింత పెరిగేలా ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాలపరిమితి మూడేండ్లకు పెంచుతున్నందున భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు.


దుకాణాల పెంపు.. కొత్త బ్రాండ్లు!

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 2,620 మద్యం దుకాణాలు ఉండగా.. వాటి సంఖ్యను పెంచేలా ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది. ఎక్కడ ఏర్పాటు చేస్తే ఆదాయం సమకూరుతుందో నివేదికలు తెప్పించుకున్నట్లు సమాచారం. ఇటీవల ప్రకటించిన నూతన మున్సిపాలిటీల్లో కొత్త దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతోపాటు రూరల్ ఏరియాల్లో సైతం దుకాణాల సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. మరోవైపు కల్లు దుకాణాలు మూసివేసిన ప్రాంతాల్లో కూడా కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించి గౌడ సంఘాలతో చర్చలు జరపాలనుకుంటున్నారు. అదే విధంగా రాష్ట్రంలో మద్యం విక్రయాల కోసం 604 కొత్త బ్రాండ్ల నుంచి దరఖాస్తులు రాగా, వచ్చే టర్మ్ నుంచి అనుమతులు ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

లాటరీ పద్ధతిలోనే..

అజామాయిషీ చేసే బేవరేజేస్ సంస్థలు, లిక్కర్ సిండికేట్లకు కళ్లెం వేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ విషయంపై గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. దీనిలో భాగంగా కొత్త మద్యం దుకాణాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సీఎం అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే టెండర్ల ప్రక్రియ నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. పదిహేను రోజుల పాటు టెండర్ల స్వీకరించేందుకు గడువు ఇవ్వనున్నారు. అయితే ఈ సారి కూడా లాటరీ పద్ధతిలోనే దుకాణాల ఎంపిక ప్రక్రియ ఉండనున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

# నటి రేణు దేశాయ్ సంచలన పోస్ట్




హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1

నటి రేణు దేశాయ్ తాజాగా ఇన్స్టాలో షేర్ చేసిన ఓ స్టోరీ నెట్టింట దుమారం రేపుతోంది. "ఒక కుక్క మనిషిని కరిచిందని, ఏ పాపం చేయని వీధి కుక్కలను అన్నింటినీ చంపేయడం ఎంత న్యాయం. అదే సమాజంలో రేపిస్టులు, మర్డర్ చేసినవాళు మాత్రం మన చుట్టూ స్వేచ్ఛగా తిరుగుతున్నారు ఇదెక్కడి న్యాయం. " అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సంచలనం సృష్టిస్తోంది.

# 11 కేవీ విద్యుత్ షాక్‌తో యువకుడి దుర్మరణం



ములుగు నూగూరూ వెంకటాపురం నివాస్ న్యూస్ ఆగస్టు 1ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండలంలోని బీసీ మరిగూడెం గ్రామానికి చెందిన మడకం విజయ్ (వయసు 28) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం వెలుగుచూసింది. శాంతినగర్‌కు మంజూరైన కొత్త పాఠశాలలో విద్యుద్దారం పనులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది.

వివరాలలోకి వెళితే

నూతనంగా మంజూరైన శాంతినగర్ పాఠశాలలో విద్యుత్ పనులు చేపట్టిన విజయ్, స్కూల్‌లో వైరింగ్ పనులు చేస్తుండగా అఘటితంగా 11 కేవీ హై వోల్టేజ్ విద్యుత్ లైన్ అతడికి తగిలింది. విద్యుత్ షాక్ తగలగానే విజయ్ అక్కడికక్కడే నేలకూలిపోగా, ప్రక్కనున్నవారు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం పోలీసుల పర్యవేక్షణలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ప్రమాదానికి గల అసలు కారణం తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విజయ్ం మృత్యువు పట్ల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతుండగా, స్థానిక ప్రజలు ఎలాంటి భద్రతా చర్యలు లేకుండా ప్రభుత్వ పనులు చేపడతారా అని ప్రశ్నిస్తున్నారు.

ప్రశ్నలు రేకెత్తిస్తున్న నిర్లక్ష్యం:

విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ పరిపాలకులు బాధ్యత తీసుకుంటారా?

11 కేవీ లైన్ ఉండగా భద్రతా చర్యలు ఎందుకు పాటించలేదు?

యువకుడి మరణానికి న్యాయం జరగాలన్న డిమాండు ప్రజల్లో వెల్లివిరుస్తోంది.

మృతుని కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ఈ సంఘటనను మర్చిపోలేమని గ్రామస్తులు, బీసీ సంఘాలు పేర్కొంటున్నాయి.

విజయ్ మృతి వల్ల ఒక కుటుంబం ఆశలు నశించాయి బాధ్యత వహించాల్సింది ఎవరు..?

# ఆగస్ట్ 2న 'అన్నదాత సుఖీభవ' అమలు

**46,85,838 మంది రైతులకు పథకంతో లబ్ది**
**మొదటివిడతలో ఒక్కో రైతుకు రూ.5,000**
**రూ.2,342.92 కోట్ల నిధుల కేటాయింపు**
**కేంద్రం ఇచ్చే రూ.2 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు జమ**
**ప్రకాశం జిల్లా దర్శిలో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**
**ఒకరోజు ముందే 'మనమిత్ర' ద్వారా లబ్దిదారులకు సందేశం**
**సాగునీటి ఎద్దడి, ఎరువుల కొరత రానివ్వకండి**
**జిల్లా కలెక్టర్లకు, అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం**
**సందేహాల నివృత్తికి 155251 టోల్ ఫ్రీ నెంబర్**

ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్



కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఆగస్ట్ 2న అమలు చేయాలని నిర్ణయించింది. ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. దీంతో రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు లబ్ధి పొందుతారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5,000 చొప్పున మొత్తం రూ.2,342.92 కోట్ల నిధుల్ని వారి ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమ చేయనుంది.

రైతులకు సాయం భారం కాదు... బాధ్యత

'అన్నదాత సుఖీభవ' అమలు సన్నద్ధతపై గురువారం సచివాలయంలో ఆర్థిక, రెవెన్యూ, జలవనరులు, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి పలు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ప్రతీ రైతుకూ అన్నదాత సుఖీభవ అందాలని, రైతులకు చేయూతనివ్వడం భారం కాదు.. బాధ్యతగా గుర్తు పెట్టుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులకు నిధులే కాదు.. నీళ్లూ ఇస్తున్నామని చెప్పారు.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం

'ఆగస్ట్ 2న 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలి. గ్రామ సచివాలయం నుంచి పంచాయతీలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించాలి. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది. నాడు ఆర్థిక విధ్వంసం జరిగింది. ప్రతీ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నాం. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. రైతులకు హామీ ఇచ్చినట్టుగానే 'అన్నదాత సుఖీభవ'ను అమలు చేసి చూపించాం. పథకాలు అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం. చేసిన మంచిని ప్రజలకు చెప్పాలి. రాజకీయ నేతలు పాలసీలు మాత్రమే తయారు చేస్తారు... వాటిని అమలు చేసేది అధికారులే. వ్యవస్థలో అందరూ జావాబుదారీతనంతో వ్యవహరించాలి. అన్నదాత సుఖీభవ అందుకునే రైతులకు సెల్ ఫోన్లకు ఒకరోజు ముందే 'మనమిత్ర' ద్వారా సందేశాలు వెళ్లాలి. రైతులు తమ ఖాతాలను యాక్టివేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించండి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

వ్యవసాయ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం

'ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. బొప్పాయి ధర తగ్గిందని కథనాలు వస్తున్నాయి... వాటిపైనా సమీక్ష చేసి రైతులకు న్యాయం చేయాలి. ఎరువుల విషయంలో కలెక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలి... ఎక్కడా కొరత రానీయొద్దు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. గండికోట, బ్రహ్మంసాగర్, సోమశిల, కండలేరు ప్రాజెక్టులను వందశాతం నీటితో నింపాలి. రిజర్వాయర్లలో ఎంత నీరు ఉందనే సమాచారం ఉండాలి. నీటి నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలి. భారత్‌పై అమెరికా 25 శాతం సుంకాలు విధించింది. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొనాలి. ఇప్పటి వరకు రైతులకు ప్రభుత్వం అందించిన సాయం, ఇతర వివరాలతో కరపత్రం రూపొందించి క్షేత్రస్థాయిలో ఇవ్వాలి' అని ముఖ్యమంత్రి కలెక్టర్లకు సూచించారు.

ఆగస్ట్ 2న ఒక్కో రైతుకు మొత్తం రూ.7,000 జమలి

ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20,000 చొప్పున అందిస్తామన్న కూటమి హామీని 'అన్నదాత సుఖీభవ', 'పీఎం కిసాన్' అమలుతో నెరవేర్చినట్టయ్యింది. ఏడాదికి కేంద్రం ఇచ్చే రూ.6,000 సాయంతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14,000 ఇవ్వనుంది. మొదటి, రెండో విడత రూ.5 వేల చొప్పున, అలాగే మూడో విడత రూ.4 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఈ రూ.14 వేలను 3 విడతలుగా అందించాలని గతంలోనే నిర్ణయించారు. కేంద్రం మొదటివిడతగా రూ.2,000 చొప్పున రూ.831.51 కోట్లు రైతులకు సాయం చేయనుంది. దీంతో ఆగస్ట్ 2న కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7,000 జమ చేసినట్టు అవుతుంది. మరోవైపు 'అన్నదాత సుఖీభవ'కు సంబంధించి 59,750 గ్రీవెన్సులు నమోదుకాగా... వాటిలో 58,464 దరఖాస్తులను పరిష్కరించారు. ఈ పథకంపై సందేహాలను నివృత్తి చేసేందుకు 155251 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులో ఉంచారు.

ఈ సమీక్షలో సీఎస్ కె.విజయానంద్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మీ, సీఎం ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ కుమార్, సీఎం కార్యదర్శి రాజమౌళి, అగ్రికల్చర్ డైరెక్టర్ డిల్లీరావు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# కాలేజీ చదువులకు 'మార్కాపురం' దూరం: ఎస్ఎఫ్ఐ

మార్కాపురం : ప్రస్తుతం డివిజన్ కేంద్రంగా ఉన్న 'మార్కాపురం' రేపోమాపో జిల్లా కేంద్రం కూడా అవుతుందంటున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన మార్కాపురం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు నేటికీ ఏర్పాటు కాకపోవడం శోచనీయ మని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ మార్కాపురం మండల ప్లీనం కార్యక్రమానికి అజరు అధ్యక్షత వహించారు. ఈ వీరస్వామి మాట్లాడుతూ మార్కాపురం పూర్తిగా వెనకబడిన ప్రాంతమన్నారు. సాగునీరు, తాగునీరు అందుబాటులో లేదన్నారు. కనీసం పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ పరంగా కాలేజీ చదువులు కూడా అందుబాటులో లేకపోవడం సిగ్గు చేటన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు కావడం జరిగిందన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణం సగం వరకు పూర్తయిందన్నారు. కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వెనుకబాటులో ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన పాలకులు పనికిమాలిన నిర్ణయాలు తీసుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ఈ ప్రాంతానికి సిఎం చంద్రబాబు గత మార్చి 8న మార్కాపురం వచ్చారని, గత నెల 4వ తేదీన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కూడా మార్కాపురం వచ్చారు.

# తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి

మద్రిపూడి : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. మండలంలోని చిమట గ్రామంలో జీవిత భాగస్వామ్య పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు పునాది వేసింది తెలుగుదేశం పార్టీ అని, నేడు రాష్ట్ర అభివద్ధికి ఎంతో కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. భార్య భర్తల్లో ఒకరు చనిపోయినా రెండో వారికి భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకొని పింఛన్లు మంజూరు చేసిన ఘనత తెలుగుదేశానిదే అన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, నియోజకవర్గ సమన్వయ సభ్యులు రేగుల వీరనారాయణ, మాజీ ఎంపీపీ జడ్పిటిసిలు దాసరి వెంకటేశ్వర్లు, తుళ్లూరు వెంకట నరసింహం, మాజీ వైస్ ఎంపీపీ గొంటు హనుమారెడ్డి, టిడిపి నాయకులు గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చుంచు-చురుకులు

హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు1

"తెలుగు సాహిత్య గుండు సున్నా...!"
(శ్రీశ్రీ శైలిలో సమాజ మేలుకోల్పే )
ఎవరి గొంతు నొక్కాలి?
ఎవరి సాహిత్యాన్ని తీసేయాలి?
ఎవరి విప్లవాన్ని ఆపాలి?
ఎవరి స్వరాన్ని మింగాలి?
ఏవీ మిగలకూడదా?
సహనమే మిగలకూడదా?
వివేచనకూ, విమర్శకూ చోటుండకూడదా?
సాహిత్యపు పండుగకి వంటివేనా నియంత్రణలన్నీ?
నన్నయంటే భాషా శుద్ధి
తిక్కన అంటే భావాల విరూపణ
పోతనంటే భక్తి,
వేమన అంటే చైతన్యం
వీటినన్నీ తీసేస్తే?
ఏం మిగులుతుంది?
జాషువా తలపించేది జాతివివక్ష
వంగపండు పాడినది పల్లెదారి రక్తగంధం
గద్దర్ గొంతులో గెలుపు అరుపు
కళ్యాణరావు కలంలో కులమా వేదన
వీటిని దహించేసి...
నువ్వు రాసేది ఏమిటి?
ఓల్గా, ఛాయాదేవి, కాత్యాయనీ లాంటి
తల్లి స్వరాల్ని ముట్టుకుంటే
నిన్ను మించిన పీడకే ఈ సమాజం!
సాహిత్యం పుట్టింది విమర్శకై,
పొడిగింది ప్రేమకై,
బతికింది ప్రజల బతుకు కోసం.
నీవు దాన్ని చిత్తు చేస్తే,
నీ మనసే ముందుగా శవం అవుతుంది!
పుస్తకాన్ని ముక్కలుచేసినచోట
మూగబోయే గదిలో
నిశ్శబ్దంగా నిద్రించే చైతన్యం
తిరిగి లేస్తుంది మరలా
మంచి గొంతుల వలసా..
అర్థవంతమైన కవితల వర్షమవుతుంది!
ఎర్రజండా కాదు
నీలి జెండా కాదు
మగవాదం కాదు
ఆడవాదం కాదు
నాస్తికత లేదు
భక్తి లేదు
భాషలో గడ్డిపోక కూడా మిగలదు!
కాబట్టి...
విప్లవ గేయాలనీ
వివేక గేయాలనీ
తలచుకో తలచుకో తలచుకో!
వెలుగులు ఆరిపోవాలన్నది చీకటి కోరిక,
కానీ ప్రతి అక్షరం ఓ దీపం
ప్రతి భావం ఓ దీపస్తంభం!
ఒక్కసారి ఆలోచించు...
నువ్వు తీసేసింది లిఅక్షరపు శక్తిలి అయితే
నిన్ను తీసేసేది లిచరిత్రే అవుతుంది!లి
శ్రీశ్రీ గాత్రంలో – అక్షర శాస్త్ర యుద్ధం
సందేశం లిసాహిత్యాన్ని నీతినీ, వాదననీ, వేదననీ బతికించాలి– సున్నా చేసేది సంస్కృతి కాదు – అగ్నిపరిశుద్ధిలో నిలబడే అక్షరమయ సత్యం కావాలి!

# వీరి హెయిర్ కట్ ఖర్చు రూ.1,18,000!



హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1

బాలీవుడ్ ప్రముఖులు, క్రికెట్ స్టార్లకు హెయిర్కట్ చేసే ఆలిమ్ హకీం తన ఛార్జీల గురించి ఇటీవల వెల్లడించిన వివరాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆయన చెప్పిన ప్రకారం.. విరాట్ కోహ్లి, రణ్బీర్ కపూర్, హార్దిక్ పాండ్యా, ధోనీ, రణ్వీర్ సింగ్ వంటి స్టార్లకు హెయిర్కట్ చేయాలంటే ఆయన ఒక సెషన్కి కనీసం రూ. 1 లక్ష ఛార్జ్ చేస్తారట. జీఎస్టీ కూడా కలిపితే మొత్తం రూ. 1,18,000 అవుతుందని సమాచారం..


# తగ్గిన గ్యాస్ సిలిండర్ ధరలు.. నేటి నుంచి అమలు



హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్ట్ 1

వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర మరోసారి తగ్గింది. ప్రతి నెల ఒకటో తేదీన సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తున్న ఆయిల్ కంపెనీలు.. తాజాగా వాణిజ్య సిలిండర్ ధరను రూ.33.50 తగ్గించాయి. తగ్గిన ధరలు నేటి (శుక్రవారం) నుంచే అమల్లోకి రానున్నాయి. అయితే గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీల సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేశాయి.

# తెలంగాణలో ఆపరేషన్ ముస్కాన్..



PRESS NOTE

Operation Muskaan-XI in Telangana
(Conducted from 01.07.2025 to 31.07.2025)

Date: 01.08.2025

Operation Muskaan XI, a nationwide initiative by the Ministry of Home Affairs, was conducted across Telangana from 1st to 31st July 2025 under the Women Safety Wing which is the nodal agency for the initiative in the State. A total of 121 Sub-Divisional Police Teams comprising 786 police personnel were deployed in convergence with the Women Development and Child Welfare Department, Labour, Health, CWCs, DCPUs, and NGOs.

A state-level convergence meeting was held on 27.06.2025, followed by training on SOPs and legal provisions including the JJ Act 2015, Child Labour Act, and Bonded Labour Act. Vulnerable areas such as railway/bus stations, religious sites, brick kilns, mechanic shops, construction sites, tea stalls were mapped and combed.

**Key Outcomes:**

- **Total children rescued:** 7678 (Boys: 7149 | Girls: 529)
  - From other states/countries: 3787 (from 12 States like Odisha, Bihar, MP, Rajasthan etc., – 3783, from Nepal – 04)
  - Child Labour: 6718
  - Street Children: 357
  - Begging: 42
  - Bonded Labour: 2
  - From other employments: 559
- **Cases registered:** 1713 FIRs; 1718 accused arrested; 1745 children rescued in these cases
- **Inspection Reports:** 1613 reports issued by Labour Department
- **Rehabilitation:**
  - 6593 children reunited with families
  - 1049 admitted to rescue homes
  - ₹47.76 lakhs fine amount imposed under Minimum Wages act by Labour Dept.,
  - 2600 migrant children enrolled in 29 Urban Bridge Schools

Operation Muskaan XI reinforced Telangana Police's commitment to eradicating child trafficking and bonded labour through sustained, multi-agency coordination.

Addl. Director General of Police,
Women Safety Wing,
Telangana, Hyderabad.

హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1

7,678 మంది చిన్నారులను రక్షించిన పోలీసులు
7,149 మంది బాలురు, 529 మంది బాలికలను రక్షించిన పోలీసులు
మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన 3,783, నేపాల్‌కు చెందిన నలుగురు గుర్తింపు
357 మంది వీధి బాలలు, 42 మంది యాచక చిన్నారులు గుర్తింపు
ఇప్పటివరకు 1,713 కేసులు నమోదు, 1,718 మంది నిందితులు అరెస్టు
6,593 మంది పిల్లలను వారి కుటుంబాలకు అప్పగించిన పోలీసులు
1,049 మంది చిన్నారులను రెస్క్యూ హోంకు తరలించిన పోలీసులు.

# జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీతలకు అభినందనలు-పవన్



ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్ట్ 1

భగవంత్ కేసరి చిత్రానికి జాతీయ అవార్డు రావడం సంతోషం భగవంత్ కేసరి చిత్రబృందానికి అభినందనలు-పవన్‌కల్యాణ్

# మహిళా వి ఆర్.ఓ.పై లైంగిక వేధింపులు తహసీల్దార్ సస్పెండ్




తిరుపతి జిల్లా నివాస్ న్యూస్ ఆగస్టు 1

ఆంధ్రప్రదేశ్ మహిళా వి ఆర్ ఓ. పై లైంగిక వేధింపులకు పాల్పడిన తిరుపతి జిల్లా వాకాడు మండల తహశీల్దార్ రామయ్యను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాయుడుపేట బీఎంఆర్ నగర్లో నివాసం ఉంటున్న వీఆర్వో ఇంటికి కొన్ని రోజుల క్రితం తహసీల్దార్ వెళ్లాడు. అది గమనించిన వీ.ఆర.ఓ తల్లి తహశీల్దార్‌కు దేహశుద్ధి చేసిన వీడియోలు గురువారం ఎస్ ఎం.లో వైరల్ అయ్యాయి.బాధితురాలిఫిర్యాదు మేరకు తహశీల్దార్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

# సీఎం రేవంత్‌కు హైకోర్టులో ఊరట



హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు1

రేవంత్‌పై కాసం వెంకటేశ్వర్లు వేసిన కేసు కొట్టివేత రిజర్వేషన్లపై రేవంత్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ.. గతంలో నాంపల్లి కోర్టులో కాసం వెంకటేశ్వర్లు పిటిషన్‌హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసిన సీఎం రేవంత్

# ఫిరాయింపు ఎమ్మెల్సీలపై కూడా సుప్రీం కోర్టులో పిటిషన్?

హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్ట్ 1



కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ గురువారం తన ఫామ్‌హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు.

సుప్రీం కోర్టు ఆదేశం మేరకు మూడు నెలల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయక తప్పదని వారు అభిప్రాయపడ్డారు. కనుక న్యాయ నిపుణులతో చర్చించి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఆరుగురు ఎమ్మెల్సీలపై కూడా అనర్హత వేటు వేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఏపీ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుని అడ్డుకునేందుకు రాజకీయ ప్రయత్నాలు ఫలించకపోతే దీనిపై కూడా సుప్రీం కోర్టుని ఆశ్రయించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీం కోర్టు తాజా తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ, "సుప్రీం కోర్టు ఆదేశం మేరకు మూడు నెలల్లోగా 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం తీసుకోక తప్పదు. కనుక ఈ 10 స్థానాలకు ఉప ఎన్నికలు జరుగబోతున్నాయి. కనుక ఎన్నికలను ఎదుర్కోవడానికి పార్టీ శ్రేణులు అందరూ సిద్దంగా ఉండాలి," అని పిలుపునిచ్చారు.

# వి.సా.రెడ్డి కుమార్తెకు రూ.17 కోట్ల జరిమానా ..కేసులు అదనం!

ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్టు 1



విజయసాయిరెడ్డి చేసిన నిర్వాకానికి ఆయన కుమార్తె ఇప్పుడు భారీగా మూల్యం చెల్లించాల్సి వస్తోంది. సముద్ర తీరంలో సీఆర్జెడ్ నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిందుకు విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి పదిహేడునున్న కోట్ల మేర జరిమానా విధించారు. హైకోర్టు ఆదేశాల మేరకు నియమితులైన కమిటీ ఈ ఈ మేరకు సిఫారసు చేసింది. బీచార్ లో అక్రమ నిర్మాణాలు చేసినందుకు రోజుకు లక్షా ఇరవై వేల చొప్పిన 1455 రోజుల పాటు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. నిర్మాణాల కోసం తవ్విన ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిఉంది. అవి పూర్తయ్యే వరకూ అదనంగా రోజుకు రూ. లక్షా ఇరవై వేలు కట్టాల్సి. మూడు నెలల్లోనే పునరుద్ధరించకపోతే జరిమానా రెట్టింపు చేస్తారు. వైసీపీ హయాంలో తమకు ఎదురే లేదని అనుకున్నారు వైసీపీ నేతలు. జగన్ రెడ్డి రుషికొండకు గుండు కొడితే.. విజయసాయిరెడ్డి బీచ్ ను కబ్జా చేశారు. కుమార్తె పేరు మీద భారీ రిసార్ట్స్ ను నిర్మించేందుకు అన్ని రకాల నిబంధనలు ఉల్లంఘించారు. బీచ్ లో చాలా తోతుగా తవ్వి గోడలు కూడా నిర్మించుకున్నారు. ఇప్పుడు అదంతా నిబంధనలకు విరుద్ధమని.. పర్యావరణానికి తూట్లు పొడిచారని తేలడంతో ఆయన కుమార్తెపై ఇప్పటికే కేసులు నమోదు చేశారు. జరిమానా చెల్లించాల్సి ఉంది. చెల్లించకపోతే రెట్టింపు చేస్తారు. కోర్టు ఆదేశాలతో బీచ్ లో నిర్మాణాలు తొలగించినప్పటికీ వ్యర్థాలను ఇంకా అక్కడే ఉంచారు. ఇది కూడా పర్యావరణ కమిటీకి తన నివేదికలో తెలిపింది. బీచ్ లో గోడను కింద నుంచి తొలగించడానికి అవసరమ్యే ఖర్చును కూడా నేహారెడ్డి డిపాజిట్ చేయాల్సి ఉంది. అధికారం ఉందని ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తే ఎప్పటికైనా చట్టం చేతులు పట్టేస్తుందని విజయసాయిరెడ్డి వ్యవహారమే ఉదాహరణగా నిలుస్తోంది.

# ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కీలక వ్యాఖ్యలు.

ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్టు 1 పోలీస్ శాఖలో వీఆర్ కూడా ఒక భాగమే. అడ్మినిస్ట్రేషన్ లో ఇది కూడా ఒక పోస్టింగ్ శాఖాపరమైన నిర్ణయాలు పోలీస్ శాఖ అంతర్గత విషయం.. నూజివీడు దగ్గర పోలీస్ అకాడమీకి భూమి కేటాయించారు. సర్వే పూర్తయిన తర్వాత పనులు ప్రారంభిస్తాం : ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా




# బనకచర్లపై మంత్రి నారా లోకేష్ ట్వీట్

ఆంధ్రప్రదేశ్ నివాస్ న్యూస్ ఆగస్టు1

తెలుగు ప్రజల హక్కుల కోసం టిడిపి నిలబడుతుంది 2014-19 మధ్య కేంద్రం అనుమతి లేకుండా.. తెలంగాణ సర్కార్ కాళేశ్వరం నిర్మాణం చేపట్టింది అయినా వేం కేంద్రానికి లేఖలు రాయలేదు-లోకేష్ కాళేశ్వరం వల్ల తెలుగు ప్రజలకే లాభం-లోకేష్ అది బనకచర్లకు ఎందుకు వర్తించకూడదు-లోకేష్ వృధాగా సముద్రంలో కలిసే నీటిలో.. స్వల్ప భాగవే బనకచర్ల ఉపయోగించుకుంటోంది బనకచర్లకు అందరూ మద్దతివ్వాలి-లోకేష్



# సృష్టి ఫెర్టిలిటీ కేసులో డా.నమ్రతకు పోలీస్ కస్టడీ

హైదరాబాద్ నివాస్ న్యూస్ ఆగస్టు 1 నేడు డా.నమ్రతను కస్టడీకి తీసుకోనున్న పోలీసులు 5 రోజులు నమ్రతను విచారించనున్న గోపాలపురం పోలీసులు సరోగసీ పేరుతో ఎంత మందిని ట్రాప్ చేశారనేదానిపై ఆరా గాంధీ ఆస్పత్రి అనస్థీషియా డాక్టర్ సదానందంతో.. డాక్టర్ నమ్రతకు సంబంధాలపై పోలీసుల విచారణ ల్యాబ్ టెక్నీషియన్ చెన్నారావు పాత్రపైనా ఆరా నమ్రత కొడుకు జయంతి కృష్ణతో పాటు.. ఏజెంట్ సంతోషిని కస్టడీకి కోరనున్న పోలీసులు

